TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్

# వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 72 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ గురువారం | జూన్ 25, 2026

## తుంగభద్ర డ్యామ్‌కు 33 కొత్త గేట్లు

- ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు, కేంద్రమంత్రి
- రూ.51 కోట్లతో ఆధునికీకరణ పనులు పూర్తి
- గేట్లను ప్రారంభించిన చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్, సీఆర్ పాటిల్
- ముగిసిన అంతర్రాష్ట్ర జలవనరుల కీలక భేటీ




**బళ్లారి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కర్ణాటకలోని హోస్పేటలో గల చారిత్రాత్మక తుంగభద్ర ప్రాజెక్టు నూతన స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం అత్యంత అట్టహాసంగా జరిగింది. రూ. 51 కోట్ల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 33 క్రస్ట్ గేట్లను కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. గత 2024 ఆగస్టులో వచ్చిన భారీ వరద ఉధృతికి తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక, సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు సమకూర్చి, యుద్ధప్రాతిపదికన పాత గేట్ల స్థానంలో ఈ 33 కొత్త గేట్లను అమర్చాయి. గేట్ల ప్రారంభోత్సవానికి ముందు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో ముగ్గురు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.




## వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు

- వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు
- 32 మంది మృతి, శతాబ్దంలోనే అతిపెద్ద విపత్తు
- కేవలం 39 సెకన్ల వ్యవధిలోనే 7.2, 7.5 తీవ్రతతో భారీ ప్రకంపనలు
- నేలమట్టమైన భారీ భవనాలు, అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోవడంతో కలకలం
- లక్షకు చేరవచ్చని యూఎస్ జీఎస్ అంచనా..
- దేశంలో అత్యవసర పరిస్థితి విధింపు

**వెనిజువెలా, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** దక్షిణ అమెరికా దేశం వెనిజువెలాలో ప్రకృతి ప్రకోపించింది. కేవలం 39 సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు ఆ దేశాన్ని అతలాకుతలం చేశాయి. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటల సమయంలో సంభవించిన ఈ జంట భూకంపాల ధాటికి భారీ భవనాలు, నివాస సముదాయాలు క్షణాల్లో నేలమట్టమయ్యాయి. ఈ ఘోర విపత్తులో ప్రాథమిక సమాచారం ప్రకారం 32 మంది మృతి చెందగా, 700 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వెనిజువెలా చరిత్రలో దాదాపు శతాబ్ద కాలం తర్వాత సంభవించిన అతిపెద్ద భూకంపం ఇదేనని నిపుణులు చెబుతున్నారు.

## గతాన్ని మరిచిపోండి..

- కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- చిన్న పొరపాట్లు జరిగి ఉండొచ్చు.. ఇకపై అలా జరగనివ్వం
- 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం
- చేవెళ్ల బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో భరోసా ఇచ్చిన కేటీఆర్

**వికారాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గతంలో ప్రభుత్వ పాలనపై




పెట్టిన శ్రద్ధ పార్టీ నిర్మాణంపై పెట్టలేకపోయామని, ఆ క్రమంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లను మరిచిపోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యమే

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- అభివృద్ధిని ఓర్వలేకనే బావాబామ్మర్దుల విమర్శలు
- అట్టహాసంగా ప్రారంభమైన 'ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర'
- ముగింపు సభకు ప్రియాంక గాంధీ వచ్చే అవకాశం




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గతంలో దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించకపోయి ఉంటే.. నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ప్రజాప్రతినిధులుగా, ఉన్నతాధికారులుగా ఎదిగేవాళ్లు కాదని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసేది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతల ఆధ్వర్యంలో రూపొందించిన 'ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర'ను గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, ఆ పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## కర్నాటక ప్రాజెక్టులతో మరణశాసనమే

- పాలమూరుకు చుక్కనీరు కూడా రాదు
- మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ ఆందోళన




**మహబూబ్‌నగర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు మరణ శాసనం కానుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్డీఎస్‌పై కృష్ణ పరివాహక ప్రాంతంలో ఆయా ప్రాంత రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తాము మాట్లాడుతున్నది అవాస్తవం కాదని అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల ఎత్తివేతకు హెలికాప్టర్‌లో వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అక్రమా ప్రాజెక్టులు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆర్డీఎస్‌కు వంద మీటర్ల దూరంలోనే కర్ణాటక ప్రభుత్వం లిఫ్ట్ పనులు మొదలు పెట్టిందని,

## తుంగభద్ర డ్యామ్‌కు 33 కొత్త గేట్లు

- ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు, కేంద్రమంత్రి
- రూ.51 కోట్లతో ఆధునికీకరణ పనులు పూర్తి
- గేట్లను ప్రారంభించిన చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్, సీఆర్ పాటిల్
- ముగిసిన అంతర్రాష్ట్ర జలవనరుల కీలక భేటీ



**(మొదటి పేజీ తర్వాత..)** తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా, కొద్దిసేపటి తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్రాష్ట్ర జల వివాదాలు, నీటి పంపకాలు, ఎగువ-దిగువ రాష్ట్రాల మధ్య ప్రవహించే నదుల నీటి వినియోగం తదితర కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు కేంద్రమంత్రితో పాటు ముగ్గురు ముఖ్యమంత్రులు తరలివెళ్లారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

## వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు

- 32 మంది మృతి, శతాబ్దంలోనే అతిపెద్ద విపత్తు
- కేవలం 39 సెకన్ల వ్యవధిలోనే 7.2, 7.5 తీవ్రతతో భారీ ప్రకంపనలు
- నేలమట్టమైన భారీ భవనాలు, అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోవడంతో కలకలం
- లక్షకు చేరవచ్చని యూఎస్ జీఎస్ అంచనా..
- దేశంలో అత్యవసర పరిస్థితి విధింపు



**(మొదటి పేజీ తర్వాత..)**కరీబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమంగా 21 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో 22 కిలోమీటర్ల లోతున 7.2 తీవ్రతతో మొదటి భూకంపం సంభవించింది. ఏం జరుగుతుందో గ్రహించి ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీస్తుండగానే.. కేవలం 39 సెకన్ల వ్యవధిలో అదే ప్రాంతానికి సమీపంలో 7.5 తీవ్రతతో రెండో భూకంపం విరుచుకుపడింది. దీంతో దేశ రాజధాని కారకాస్‌తో పాటు తీరప్రాంత నగరమైన లా గువైరా (లా గౌరియా) తీవ్రంగా దెబ్బతిన్నాయి. వందలాది భవనాలు కుప్పకూలిపోగా, వేల మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఈ దారుణ విపత్తులో మృతుల సంఖ్య 10 వేల నుంచి లక్ష వరకు పెరిగే అవకాశం ఉందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (USGS) సంచలన అంచనా వేసింది.

### సైమన్ బొలివర్ ఎయిర్‌పోర్ట్ ధ్వంసం..

భూకంప తీవ్రతకు వెనిజువెలాలోని ప్రముఖ సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో విమానాశ్రయం మొత్తం దట్టమైన దుమ్ముతో నిండిపోయింది. ప్రయాణికులు తమ లగేజీలను వదిలేసి ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. రోడ్లపై భారీ పగుళ్లు ఏర్పడగా, విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోయాయి. భవనాలు ఊగిపోవడం, కూలిపోవడం, ప్రజలు హాహాకారాలు చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి ప్రపంచాన్ని కంటతడి పెట్టిస్తున్నాయి.

### అత్యవసర పరిస్థితి ప్రకటన..

భూకంప తీవ్రతపై వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ స్పందిస్తూ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బాధితులను రక్షించేందుకు సైన్యం, విపత్తు నిర్వహణ బృందాలతో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరం చేసినట్లు తెలిపారు. లా గువైరా రాష్ట్రంలో పరిస్థితి అత్యంత భయానకంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, దేశ ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో కూడా బాధితులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రజలంతా ధైర్యంగా ఉండాలని కోరారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

## గతాన్ని మరిచిపోండి..

- కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- చిన్న పొరపాట్లు జరిగి ఉండొచ్చు.. ఇకపై అలా జరగనివ్వం
- 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం
- చేవెళ్ల బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో భరోసా ఇచ్చిన కేటీఆర్

**వికారాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గతంలో ప్రభుత్వ పాలనపై పెట్టిన శ్రద్ధ పార్టీ నిర్మాణంపై పెట్టలేకపోయామని, ఆ క్రమంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లను మరిచిపోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాబోయే ఐదేళ్లలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమంతో పాటు కార్యకర్తల బాగోగులను సమానంగా చూసుకునే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "2028లో మీ అందరి ఆశీస్సులతో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. ఆ తర్వాత పూర్తి బాధ్యత నేను తీసుకుంటా. ఉద్యమకారులకు, పార్టీ కోసం కష్టపడిన వారికి జరగాల్సిన న్యాయం, రావాల్సిన పదవులు, దక్కాల్సిన గౌరవాన్ని నేనే స్వయంగా అందిస్తా" అని భరోసా ఇచ్చారు. కార్యకర్తలందరికీ ప్రత్యేక ఐడీ కార్డులు



అందిస్తామని, రేపు మన ప్రభుత్వం వచ్చాక ఆ కార్డు చూస్తే అధికారులు, పోలీసులు గౌరవించి పనిచేసే పరిస్థితి తెస్తామన్నారు. "పార్టీకి అధికారం పోయి రెండున్నరేళ్లు కావస్తోంది. అయినా సరే, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఓడిపోయినా ఇంతమంది కార్యకర్తలు తరలిరావడం చూస్తుంటే గర్వంగా ఉంది. ఈ దృశ్యం కాంగ్రెస్, బీజేపీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. నాడు కొత్త రాష్ట్రం పటిష్టమైన పునాదులపై నిలబడాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ రాత్రింబవళ్లు పరిపాలనపైనే దృష్టి పెట్టారని, అందుకే పార్టీ శ్రేణులకు కొంత సమయం కేటాయించలేకపోయామని వివరించారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి తాను గుంపు మేస్త్రీనని, రియల్ ఎస్టేట్ కింగ్‌నని ఫోజులు కొట్టారని, కానీ నేడు రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని వంద అడుగుల లోతున పాతిపెట్టారని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో షాబాద్, చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లలో అంతర్జాతీయ సంస్థలైన మైక్రోసాఫ్ట్, అమెజాన్‌లను తీసుకురావడంతో ఎకరం రూ. 30 లక్షల నుంచి రూ. 3 కోట్లకు చేరిందని గుర్తుచేశారు. కానీ నేడు రేవంత్ రెడ్డి పుణ్యమా అని గతంలో కోటి పలికిన భూమిని రూ. 50 లక్షలకు కూడా కొనే నాథుడు లేడని, ఈ రంగంపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యమే

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- అభివృద్ధిని ఓర్వలేకనే బావాబామ్మర్దుల విమర్శలు
- అట్టహాసంగా ప్రారంభమైన 'ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర'
- ముగింపు సభకు ప్రియాంక గాంధీ వచ్చే అవకాశం



**(మొదటి పేజీ తర్వాత..)**పై కేటీఆర్, హరీశ్‌రావుల శకం ముగిసిపోయిందని, అధికారం కోల్పోయామన్న కసితోనే వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని చూసి భరించలేకనే బావాబామ్మర్దులు అసూయతో మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రూ. 1.78 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించామని, ప్రతిష్టాత్మక 'ఫ్యూచర్ సిటీ' ఏర్పాటు ద్వారా మరో రూ. 5.78లక్షల కోట్ల పెట్టుబడులను సాధించబోతున్నామని మహేష్ కుమార్ గౌడ్ వివరించారు. ఈ సంక్షేమ, అభివృద్ధి ఫలాల ఆధారంగానే వచ్చే ఎన్నికల్లో కనీసం 100 స్థానాలకు తగ్గకుండా గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సాగనున్న ఈ గిరిజన బస్సు యాత్ర ముగింపు సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని ఆహ్వానించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన లంబాడ, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతలు,గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కర్నాటక ప్రాజెక్టులతో మరణశాసనమే

- పాలమూరుకు చుక్కనీరు కూడా రాదు
- మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ ఆందోళన

**(మొదటి పేజీ తర్వాత..)**వీటితోపాటు మరో రెండు రోడ్ కమ్ బ్యారేజులు కడుతుందని ఆరోపించారు. చంద్రబాబు గుండ్రేవుల వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్‌కు ప్రణాళిక తయారు చేశారని వెల్లడించారు. వీటి వల్ల తుంగభద్ర నీరు శ్రీశైలంకు శాశ్వతంగా రావని వివరించారు. కృష్ణా పైకూడా అనేక ప్రాజెక్టులు కడుతున్నారని, ఇవన్నీ ఎలాంటి అనుమతులు లేకుండానే జరుగుతున్నాయని వెల్లడించారు. అక్రమ నిర్మాణాలు పూర్తయితే పాలమూరు లో ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఒక్క చుక్క నీరు రాదని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అయినా అక్రమ ప్రాజెక్టుల వద్దకు వెళ్లి చూడాలని కోరారు. జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా వ్యతిరేకించారని తెలిపారు. బీఆరఎస్ ప్రభుత్వం వస్తే కర్ణాటక, ఏపీ ప్రభుత్వాలు అక్రమంగా చేపట్టిన ప్రాజెక్టు పనులు నిలిపివేస్తామని అన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH

గురువారం, జూన్ 25, 2026

# అచ్చంపేటలో 4వ మెగా సర్జికల్ క్యాంప్ ప్రారంభం

- స్వయంగా శస్త్రచికిత్సలు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మొదటి రోజే 80 ఆపరేషన్లు విజయవంతం
- 800 మంది రోగుల నమోదు..
- దశలవారీగా చికిత్సలు

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో




గురువారం నాలుగో విడత మెగా సర్జికల్ క్యాంపును స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. వృత్తిరీత్యా వైద్యుడైన ఆయన, రాజకీయాల్లో ఉంటూనే తన వృత్తిని ప్రజాసేవకు అంకితం చేస్తూ స్వయంగా రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించడం విశేషం. ఈ క్యాంపునకు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ రకాల శస్త్రచికిత్సల కోసం సుమారు 800 మంది రోగులు తమ పేర్లు నమోదు చేసుకోగా, తొలిరోజే దాదాపు 80 ఆపరేషన్లను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేద రోగులపై ఆర్థిక భారం పడకుండా ఉచితంగా మెరుగైన వైద్యం అందించేందుకు ఈ మెగా సర్జికల్ క్యాంపులను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత మూడు విడతల క్యాంపుల్లో మొత్తం 1,472 మందికి వివిధ రకాల శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న మిగతా రోగులకు కూడా దశలవారీగా ఆపరేషన్లు చేస్తామని,



వారి ఆరోగ్య పరిస్థితిని తానే స్వయంగా పర్యవేక్షిస్తానని భరోసా ఇచ్చారు. క్యాంప్ విజయవంతానికి సహకరిస్తున్న స్థానిక వైద్య సిబ్బందితో పాటు కల్వకుర్తి, వనపర్తి ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 60 మంది వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని ఆయన అభినందించారు. అలాగే శస్త్రచికిత్సలకు అవసరమైన వైద్య పరికరాలతో పాటు గాలి పంకాలు, వీల్చైర్లు, స్ట్రెచర్లు విరాళంగా అందించిన అచ్చంపేట మెడికల్ షాపుల యజమానులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ తారాసింగ్, డాక్టర్ మహేష్, డాక్టర్ ప్రదీప్ రాజ్ పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

- అసిస్టెంట్ కమాండెంట్ కె. బాలయ్య
- 4వ బెటాలియన్‌లో "వైల్డ్ సురక్ష" అవగాహన సదస్సు

**మామునూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వన్యప్రాణుల సంరక్షణలో అటవీ శాఖతో పాటు భద్రతా సిబ్బంది, ప్రజల పాత్ర ఎంతో కీలకమని 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ కె. బాలయ్య అన్నారు. బెటాలియన్ ఆవరణలో వన్యప్రాణుల సంరక్షణ, పరిశోధన రంగంలో పనిచేస్తున్న 'సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్' సంస్థ ఆధ్వర్యంలో 'వైల్డ్ సురక్ష' పేరిట ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రామిండ్ల తిరుపతి సిబ్బందికి వన్యప్రాణుల రక్షణపై దిశానిర్దేశం చేశారు. వన్యప్రాణుల ప్రవర్తన, మానవ-మృగ సంఘర్షణలు, వన్యప్రాణుల వేట, అక్రమ రవాణా వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా పులి, చిరుత, ఎలుగుబంటి వంటి క్రూరమృగాలు అకస్మాత్తుగా ఎదురైనప్పుడు ప్రాణాపాయం నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.





అనంతరం అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ.. ప్రత్యేక పోలీసు విభాగం ఎక్కువగా గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తుంటుందని, కాబట్టి వన్యప్రాణుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'వైల్డ్ సురక్ష' అందించిన శిక్షణ సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జె. రాజేందర్, ఆర్ఐలు రవి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణ, సురక్ష ట్రైనర్ త్రివేణి,బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబట్‌పల్లిలో బ్యాంకును వెంటనే ఏర్పాటు చేయాలి

- ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

**లింగాల (అచ్చంపేట), వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబట్‌పల్లి గ్రామానికి మంజూరైన బ్యాంకును ఎలాంటి రాజకీయ విభేదాలు లేకుండా వెంటనే ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. గతంలో రాములు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే గ్రామానికి బ్యాంకు మంజూరైనప్పటికీ.. స్థానిక వర్గపోరు, స్థలం ఎంపిక వివాదాల కారణంగా అది కాస్తా బాల్మూర్‌కు తరలిపోయిందని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంపీల ప్రత్యేక చొరవతో మరోసారి అంబట్‌పల్లికి బ్యాంకు మంజూరు కావడంపై హర్షం వ్యక్తమవుతున్నా, గత అనుభవాల దృష్ట్యా మళ్లీ ఎక్కడ వివాదాలు తలెత్తి బ్యాంకు చేజారిపోతుందోనని గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సుమారు 6,000 జనాభా, 4,100 మంది ఓటర్లు ఉన్న అంబట్‌పల్లిలో 2,500కు పైగా బ్యాంకు ఖాతాల అవసరం ఉంది. నిత్యం రైతులు, కూలీలు, మహిళా సంఘాలు, వృద్ధులు పెన్షన్లు, ఇతర బ్యాంకింగ్ సేవల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, అధికారులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, వెంటనే స్థలాన్ని ఖరారు చేసి టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజల చిరకాల కోరిక అయిన బ్యాంకు ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తే, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలను సమీకరించి శాంతియుత ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



# ఓటరు జాబితాను ప్రతి ఒక్కరూ సరిచూసుకోవాలి

## ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**వేములవాడ అర్బన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సరిచూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణా గ్రామంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ సవరణ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రజలు పరిశీలించుకోవాలని, ఒకవేళ పేరు లేకపోతే వెంటనే కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకునేలా అవగాహన కల్పించడంలో బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపి, వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వేములవాడ రూరల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కొడుముంజ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొమిరె వెంకట సాయి గౌడ్ తల్లి కొమిరె లక్ష్మీ నాగవ్వ దశదిన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడుముంజ గ్రామంలోని వారి నివాసానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి హాజరయ్యారు. అక్కడ లక్ష్మీ నాగవ్వ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసప్తప్త కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మనోహర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు విక్కుర్తి అరుణాద్రి, ఆదిత్య, మధు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని నివాళులర్పించారు.

# నేటి నుంచి దళిత, గిరిజన వాడల సందర్శన



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జూన్ 26 నుండి జూలై 25 వరకు నెల రోజుల పాటు దళిత, గిరిజన వాడలను సందర్శించనున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నాగరాజు తెలిపారు. ఉప్పునుంతల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత, గిరిజన గూడేలలోని ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలి పోరాటాలు, పోడు భూముల సమస్యలు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతుల సాధన కోసం స్థానికంగా ఉద్యమిస్తామన్నారు. ఈ పర్యటనల ద్వారా గ్రామీణ కార్మికులను ఏకం చేస్తూ 'రూరల్ వర్కర్స్' నిర్మాణాన్ని బలోపేతం చేయడమే కాకుండా, పేదలకు భూమి దక్కేలా భూ ఉద్యమాలను ఉధృతం చేస్తామని నాగరాజు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వెంకటరమణ నాయక్, ఎండీ పాషా తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
గురువారం, జూన్ 25, 2026

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం వేగవంతం చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు, నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్" నిర్మాణ పనులను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరంగల్ మండలం పైడిపల్లి గ్రామంలో శరవేగంగా జరుగుతున్న ఈ పాఠశాల భవన నిర్మాణ పనుల పురోగతిని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పరిశీలనలో భాగంగా కలెక్టర్ నిర్మాణ పనులను కూలంకషంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వై.వి.గణేష్, జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, భవన నిర్మాణ కాంట్రాక్టర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్ ఎక్సైజ్ సీఐ ఇంట్లో ఏసీబీ సోదాలు

- రూ. 87.44 లక్షల అక్రమాస్తులు గుర్తింపు
- గతంలో వేములవాడ ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన గుండెటి రాము
- జగిత్యాలలోని అద్దె ఇంట్లో ఏసీబీ తనిఖీలు
- భారీగా బ్యాంక్ నిల్వలు, ప్లాట్లు స్వాధీనం

**సిరిసిల్ల/కరీంనగర్ క్రైం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమ మార్గాల్లో ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై కరీంనగర్ అర్బన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గుండెటి రాము (42) ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. గతంలో వేములవాడ ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ ఏడాది మార్చి 17న నమోదైన క్రిమినల్ దుష్ప్రవర్తన కేసు ఆధారంగా ఏసీబీ అధికారులు జగిత్యాలలోని భవానీ నగర్‌లో గల ఆయన అద్దె ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో దస్తావేజుల ప్రకారం రూ. 87,44,629 విలువైన అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. అయితే వీటి బహిరంగ మార్కెట్ విలువ కొన్ని కోట్ల రూపాయల్లో ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సీఐ రాము ఎస్‌బీఐ ఖాతాలో రూ. 29.88 లక్షల బ్యాంక్ నిల్వలు. ఆయన తండ్రి యూబీఐ ఖాతాలో రూ. 16.77 లక్షల డిపాజిట్లు. తనిఖీల సమయంలో ఇంట్లో దొరికిన రూ. 20.67 లక్షల చేతి నగదు. రూ. 11.97 లక్షల విలువైన ఇతర గృహోపకరణ సామాగ్రి. కరీంనగర్ పట్టణంలో రూ. 6.05 లక్షల విలువైన ఓపెన్ ప్లాట్, సిరిసిల్లలో రూ. 2.18 లక్షల విలువైన కమర్షియల్ ల్యాండ్ పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో లోతైన దర్యాప్తుతో పాటు సోదాలు ఇంకా కొనసాగుతున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు గానీ, వాట్సాప్ నంబర్ 9440446106కు గానీ ఫిర్యాదు చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతామని అధికారులు స్పష్టం చేశారు.



## కల్తీ పచ్చళ్ల గుట్టురట్టు

- టాస్క్ ఫోర్స్ మెరుపు దాడి
- నిందితుడి అరెస్ట్..
- రూ.2.25 లక్షల విలువైన నిల్వలు స్వాధీనం
- కుళ్లిపోయిన సరుకుతో తయారీ

**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అక్రమ, కల్తీ పచ్చళ్ల తయారీ కేంద్రంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో పచ్చళ్లు తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ దాడిలో ఒకరిని అరెస్ట్ చేయడంతో పాటు భారీగా కల్తీ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ సాయి వీధిలో ఉన్న ఓ నివాస గృహంలో టాస్క్ ఫోర్స్ బలగాలు గురువారం తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో పెద్ద ఎత్తున కుళ్లిపోయిన పచ్చడి ముడిసరుకులు, నిల్వ ఉంచిన హానికరమైన ఆహార పదార్థాలను గుర్తించారు. ఈ కల్తీ పచ్చళ్లను చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసి, స్థానిక కిరాణా దుకాణాలు, ఇతర చిన్న వ్యాపార కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ అక్రమ వ్యవహార నడుపుతున్న కాశీబుగ్గ నివాసి అరికెల శ్రీనివాస్ (51)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తయారీ కేంద్రం నుండి సుమారు రూ.2,25,000 విలువైన కల్తీ ఆహార నిల్వలను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న వాటిలో మామిడి ముక్కలు 900 కిలోలు, టమోటా 750 కిలోలు, నిమ్మకాయలు 200 కిలోలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ 150 కిలోలు, ఉసిరికాయలు 100 కిలోలు ఉన్నాయి. పట్టుబడిన నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న కల్తీ సరుకును తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. సమర్పించిన బ్రాండ్ లేని, లేబుల్స్ లేని లేదా అనుమానాస్పదంగా ఉండే ఆహార పదార్థాలు, పచ్చళ్లను కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించారు. నగరంలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ నిల్వ కేంద్రాలు లేదా కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ పర్యవేక్షణలో జరిగిన ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్ బండారి రాజు, ఆర్ఎస్ఐ ఓ.భాను ప్రకాష్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



## పేదల ఇళ్లను కూల్చవద్దు

**ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి సీపీఐ విజ్ఞప్తి**

**హైదరాబాద్, ఆఫ్ వందే భారత్ :** హనుమకొండ జిల్లా గుండ్లసింగారంలో ఇటీవల పేదల ఇళ్లను అమానుషంగా కూల్చివేసిన ఘటనపై సీపీఐ రాష్ట్ర నాయకత్వం తీవ్రంగా స్పందించింది. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యులు శ్రీ వేం నరేందర్ రెడ్డిని సీపీఐ రాష్ట్ర ముఖ్య నాయకుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా గుండ్లసింగారంలో జరిగిన ఇళ్ల కూల్చివేత ఉదంతాన్ని, బాధితుల దీనస్థితిని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో నిరుపేదలు కేవలం 50 గజాల స్థలాలలో చిన్న చిన్న ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని కనికరించి పట్టాలు ఇచ్చి ప్రభుత్వం అండగా నిలవాలే తప్ప, నిర్దాక్షిణ్యంగా బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేసి వారిని రోడ్డున పడేయడం సరికాదన్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందని ఆయన హితవు పలికారు. సీపీఐ నాయకుల విజ్ఞప్తిపై ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. పేదలకు అన్యాయం జరగనివ్వమని, బాధితులకు ప్రభుత్వం తరపున తప్పకుండా సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన సీపీఐ బృందానికి హామీ ఇచ్చారు. వేం నరేందర్ రెడ్డిని కలిసిన వారిలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి. నర్సింహా, ఎమ్మెల్సీ నెమలికంటి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, వార్డు సభ్యుడు ఎలుకటి బాలరాజు తండ్రి ఆగయ్య ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం పెద్దాపూర్ గ్రామంలోని బాలరాజు నివాసానికి చేరుకుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడు ఆగయ్య చిత్రపటానికి చల్లా ధర్మారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆగయ్య మృతికి గల కారణాలను ఈ సందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నేతలు, యూత్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారా సింగ్
- అచ్చంపేటలో ఎస్ఎఫ్ఐ వినూత్న నిరసన

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నేటికీ నోట్ బుక్స్, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు ఇవ్వకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం. తారా సింగ్ మండిపడ్డారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అచ్చంపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తారా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, సిలబస్ ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు నోట్ బుక్స్ ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు సొంత డబ్బులతో పుస్తకాలు కొనుక్కుంటుండగా, పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే గత ఏడాది కాలంగా విద్యార్థులకు రావాల్సిన కాస్మోటిక్ ఛార్జీలను కూడా ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయాలని, విద్యార్థులకు అవసరమైన ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు, నోట్ బుక్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు చరణ్, జాయింట్ సెక్రటరీ రమేష్, డివిజన్ కమిటీ సభ్యులు రవి, సురేష్, రాకేష్, చందర్ బాబు, తరుణ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

